## పకడ్బందీగా కొనసాగుతున్న మేడారం మహా జాతర



2లో

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 33 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 30 జనవరి 2026


## దేశ అభివృద్ధి లక్ష్యంగా

# నిర్ణయాలు



- ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ
- రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):**పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని మిగతా2లో...

## అజిత్ పవార్‌కు

# కన్నీటి వీడ్కోలు..

- ముగిసిన అంత్యక్రియలు


2లో



## వనం వీడి..
## జనంలోకి సమ్మక్క..

- గౌరవంగా గాల్లోకి ఎస్పీ కాల్పులు..!

**మేడారం,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):**ఆసియాలోనే పెద్దదైన మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆదివాసీలు దేవతామూర్తిగా కొలిచే సమ్మక్క గద్దెపై కొలు వుదీరింది. శుక్రవారం చిలుకల గుట్ట వద్ద పూజుల చేసిన పూజారులు మేడారానికి సమ్మక్కకు తీసుకొచ్చారు. తల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాత కేకన్ గాల్లోకి కాల్పులు జరిపారు.రెండేళ్లకోసారి జరిగే మిగతా2లో...

## జీడీపీ 6.8 శాతం నుంచి

# 7.2 శాతం వృద్ధి

### పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే
### ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం మిగతా2లో...



## ఖర్గే, రాహుల్‌తో

# థరూర్ భేటీ

- కేరళ అసెంబ్లీ ఎన్నికలపై నేతల చర్చ

**న్యూఢిల్లీ,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. మిగతా2లో...

# అదృష్టంతో విజయం వరించదు

- కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం
- గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానమే లక్ష్యం
- హార్వర్డ్‌లో భారతీయ విద్యార్థులతో సిఎం రేవంత్


2లో

## మేడారం జాతర గిరిజనుల

# మహాకుంభమేళా

- దేశంలోనే అతి పెద్ద గిరజనుల పండగ
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు



**మేడారం,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి మిగతా2లో...

# నేటి విచారణకు రాలేను

- మున్సిపల్ ఎన్నికలతో బిజీగా ఉన్నా...
- ఇకముందు విచారణకు సహకరిస్తా
- నోటీసులను ఎర్రవల్లికి పంపించండి
- విచారణ కూడా ఇక్కడే చేపట్టాలి
- సిట్ నోటీసులకు కెసిఆర్ సమాధానం



**హైదరాబాద్,జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సిట్ నోటీసులపై తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు స్పందించారు. ఈ మేరకు గురువారం సిట్ అధికారులకు ఆయన లేఖ రాశారు. నేటి విచారణకు హాజరు కాలేనని ఆ లేఖలో కేసీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. ఆ లేఖలో కేసీఆర్ ఇంకా ఏమన్నారంటే.. మిగతా2లో...

## మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు

# భూమి అప్పగింత

- చరిత్రలో నిలిచిపోయే రోజ అన్న డిప్యూటి సిఎం
- ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను త్వరితగతన పూర్తి చేయాలి
- బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు


2లో

## వాస్తవాలు తెలుసుకునే

# ప్రయత్నంలో సిట్

### - కెసిఆర్‌కు నోటీసులపై పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్,జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికైనా నోటీసులు ఇవ్వొచ్చని స్పష్టం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేశారు. సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుందని.. నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలు వెలుగులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు మిగతా2లో...

# జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగు తోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయ రంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు భూమి అప్పగింత

**హైదరాబాద్,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి గురువారం కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ ల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోక పోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ సిటీలు అయినా కొత్తగూడెం ఆదిలాబాద్ లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును రాష్ట్ర క్యాబినెట్ మొత్తం కోరగా వారు సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభసూచకం అని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు 300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

# అదృష్టంతో విజయం వరించదు

**హైదరాబాద్,జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సిఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు . ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# మేడారం జాతర గిరిజనుల మహాకుంభమేళా

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క-సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంబించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# పకడ్బందీగా కొనసాగుతున్న మేడారం మహా జాతర

- అవసరమైన వారికి వైద్య సహాయం అందేలా ఏర్పాట్లు
- జాతరను నిరంతరం పర్యవేక్షిస్తున్న ప్రభుత్వం
- అధికారులతో మంత్రి పొంగులేటి ఆరా




**మేడారం,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ కుంభమేళా మేడారం మహా జాతర పకడ్బందీగా కొనసాగుతున్నది. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మేడారం జాతర ఏర్పాట్లను గురువారం ఉదయం బైక్ ల పై జిల్లా కలెక్టర్ దివాకర ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. మేడారం జంపన్న వాగు వద్ద భక్తుల స్నానాలకు గల ఏర్పాట్లను, పరిసర ప్రాంతాల పారిశుద్ధ్యం స్వయంగా తిరిగి పరిశీలించిన మంత్రి పలు సూచనలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు వచ్చే మహా జాతరలో తప్పిపోయిన వ్యక్తులను తిరిగి వారి కుటుంబానికి చేర్చే దిశగా తప్పిపోయిన వ్యక్తుల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మేడారం మహా జాతర సందర్భంగా పారిశుధ్య చర్యలు కట్టుదిట్టంగా నిర్వహించడం జరుగుతున్నది. జాతరలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన ప్రభుత్వం ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తుందని అన్నారు. మేడారం పరిసరాలతో పాటు భక్తుల దర్శనానికి వెళ్లే అన్ని సెక్టార్లలో పరిశుభ్రత పాటించడం జరుగుతున్నది, అమ్మవారి గద్దెల వద్ద శానిటేషన్ సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టడం జరిగింది, అధికారుల నిరంతర పర్యవేక్షిస్తూ గద్దెల వద్ద బెల్లం, భక్తులు సమర్పించే మొక్కలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలు మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఃూష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్దిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్- ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ది పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# అజిత్ పవార్‌కు కన్నీటి వీడ్కోలు.. ముగిసిన అంత్యక్రియలు

**మహారాష్ట్ర ,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** బారామతిలో విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఇవాళ ఉదయం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా , నితిన్ గడ్కరీ , మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితర రాజకీయ ప్రముఖులు ఈ అంతక్రియల్లో పాల్గొన్నారు.అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఆయన వర్గం ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మైదానానికి వచ్చి అధినేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది.దాంతో అజిత్ పవార్‌తోపాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్, ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.

# వనం వీడి.. జనంలోకి సమ్మక్క..

(మొదటి పేజీ తరువాయి)

మేడారం జాతరలో సమ్మక్క రాకతో భక్తజనం పులకించిపోయింది. నిన్న(బుధవారం) సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు గద్దెలపై చేరుకున్నారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. భక్తులు ఎదురుకోళ్లతో స్వాగతం పలుకగా.. డోలు, వాయిద్యాల నడుమ కోలాహలంగా గద్దెనెక్కింది సమ్మక్క. సమ్మక్క తల్లి కూడా రావడంతో భక్తజనం ఆమెను దర్శించుకొని, ఆశీర్వాదాలు తీసుకునేందుకు పోటీపడుతున్నారు.

# ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. అంతా బాగానే ఉంది. మేము కలిసి నడుస్తాము. ఇంకేం చెప్పగలను. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి నాకు ఇష్టం లేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఈరోజు ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి విచారణకు రాలేను

(మొదటి పేజీ తరువాయి)

'మున్సిపల్ ఎన్నికల నామినేషన్ పక్రియలో బిజీగా ఉన్నాను. నామినేషన్ల దాఖలుకు రేపే ఆఖరి రోజు. పలువురు అభ్యర్థులకు బీఫాంలు ఇవ్వాల్సి ఉంది. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతా' అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని సిట్ ఇచ్చిన నోటీసులకు కేసీఆర్ స్పందించారు. సిట్ నోటీసులకు కేసీఆర్ ప్రత్యుత్తరం పంపారు. శుక్రవారం విచారణ రాలేనని పోలీసులకు తెలిపారు. తనను ఎర్రవల్లిలో విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు రేపే చివరి తేదీ అయినందున విచారణకు రాలేనని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేసీఆర్ వెల్లడించారు. 160 సీఆర్‌పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలన్న నిబంధనలు లేవని పేర్కొన్నారు. భవిష్యత్తులో నోటీసులన్నింటిని ఎర్రవల్లికే పంపాలని ప్రత్యుత్తరంలో కేసీఆర్ కోరారు.సిట్ అధికారులు గురువారం తనుకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు నందినగర్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని వారు కోరారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శుక్రవారమే ఆఖరు తేదీ కావడంతో.. అభ్యర్థులను ఖరారు చేయడంతో తాను బిజీగా ఉన్నానని విచారణను మరోరోజు జరపాల్సిందిగా కేసీఆర్ పోలీసులకు తెలిపారు. జూబ్లిహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి శుక్రవారం తాను హాజరు కాలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ రెండు పేజీల లేఖ రాశారు. సెక్షన్ 160 సీఆర్పీసీ ప్రకారం మరో రోజున తనను ఎర్రవల్లిలోని నివాసంలో విచారించాలి. అంతేకాదు ఈ సెక్షన్‌లోని నిబంధనల మేరకు నాకు మీరు ముందస్తు నోటీసులు పంపించి ఆ తర్వాతే విచారించాలి. మరో విషయం 65 ఏళ్లు పైబడిన పురుషులను వారు విచారణ కోసం పోలీస్ స్టేషన్ వెళ్లనవసరం లేదు. పోలీసులే వారి ఇంటివద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. ఇకపై నాకు పంపాల్సిన నోటీసులను నేను నివసిస్తున్న ప్రాంతానికి అంటే.. ఎర్రవల్లికే పంపాలి. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తాను అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

# వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నంలో సిట్

(మొదటి పేజీ తరువాయి)

సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరు భాగస్వాములో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో పారదర్శక విచారణ జరగాలని కోరారు మహేశ్ కుమార్. 500కు పైగా ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేశారనే సమాచారం ఉందని చెప్పుకొచ్చారు.

# ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

**లేబర్ కోడ్స్, విబి రాంజీ చట్టం, జాతీయ విత్తన, విద్యుత్తు సవరణ బిల్లుల రద్దుకై కార్మిక సమరభేరి**

**ఫిబ్రవరి 4న కార్మిక సంఘాల జిల్లా సదస్సు**




**హన్మకొండ జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టి యుసి, ఏఐసిటియు కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్ణయించింది. బుధవారం రాంనగర్ లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో టి. ఉప్పలయ్య అధ్యక్షతన కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాసరావు, ఐఎన్టియుసి జిల్లా ఉపాధ్యక్షులు కస్తూరి రవి మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని ఒక వైపున ప్రజా సంక్షేమం వల్లిస్తూనే 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల రూపాయల రాయితీలను ఇచ్చిందని వారు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీ వంటి బడా పెట్టుబడి దారులకు కట్టబెడుతూ అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడులను అమలు విద్యుత్తు సవరణ చట్టం విత్తన బిల్లు, విబిజీ రాంజీ చట్టం, భీమా రంగంలోకి 100% విదేశీ పెట్టుబడులకు సంబంధించిన అనుమతి ఇచ్చి అనురంగంలోకి ప్రవేట్ కంపెనీలకు అనుమతి చట్టం చేసిందని వారు తీవ్రంగా విమర్శించారు. విద్యుత్తు ఉత్పత్తి రాజ్యాంగ వృత్య రాష్ట్ర జాబితాలోనిది ఇంతకాలం రాష్ట్రాల పోరాటం వల్ల కేంద్రం చట్టం చేయలేదు గత పార్లమెంటు సమావేశాల్లో విద్యుత్ సవరణ చట్టం 2025ను ఆమోదించింది ఈ చట్ట ప్రకారం ఇకనుండి విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణీ బాధ్యతలు కేంద్రం చూస్తుంది దీంతో విద్యుత్ చార్జీలు కేంద్రమే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా నిర్ణయించడంతో స్మార్ట్ మీటర్లు పెట్టి ముందుగానే తారీకు వసూలు చేస్తారని మండిపడ్డారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 4 వ తేదీన హనుమకొండ లో కార్మిక సంఘాలు అన్నీ కలిపి జిల్లా సదస్సును నిర్వహిస్తామని దేనిని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దాసరి నరేష్, బత్తిని సదానందం గౌడ్, గుంటి రాజేందర్ సోమగోటి రాజగోపాలాచారి, లు పాల్గొన్నారు.

# మేడారం గద్దెల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం




**ములుగు,జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న సమ్మక్కసారక్క జాతరకు తరలివచ్చే భక్తుల ఆరోగ్య పరిరక్షణకు గద్దెల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో భక్తులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, మాస్కులు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన టాబ్లెట్లు, మందులు అందజేస్తున్నారు.బుధవారం ఒక్కరోజే సుమారు 900 మందికి పైగా ఓపీ కేసులను పరిశీలించినట్లు డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. జ్వరాలు, జలుబు, దగ్గు, బీపీ, షుగర్ వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో వచ్చిన భక్తులకు తక్షణ చికిత్స అందించారు.ఈ వైద్య శిబిరంలో డీపీఎచ్ఎన్ శకుంతల, ఏఎన్ఎంలు వై. జమున, జె. సరిత, అలాగే ఆశా వర్కర్స్ సుజాత, విజయ, కవిత తదితర సిబ్బంది విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలందిస్తున్నారు.భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఇలాంటి వైద్య సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయని భక్తులు అభిప్రాయపడ్డారు.

# బహుజన మహనీయుల స్ఫూర్తితో సమన్యాయ పోరాటం

- **ఐఎల్‌పిఎ క్యాలెండర్ ఆవిష్కరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలస సుధీర్**



**హన్మకొండ జనవరి 29(పిసిడబ్ల్యు న్యూస్):** భారతదేశంలో వేల సంవత్సరాల నుండి అణచి వేతకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాలు చేసిన త్యాగ ధనులు బహుజన మహనీయుల ఉద్యమ స్ఫూర్తిని అణగారిన సమాజానికి తెలియజెప్పడం ద్వారా దేశంలో సమ న్యాయం సాధించవచ్చుని, సామాజిక న్యాయ పోరాటంలో బహుజన న్యాయవాదులు ముందుండాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్య నారాయణ, వలస సుధీర్ లు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 2026 కాలెండర్ ను ఆవిష్కరణ చేసి వారు మాట్లాడారు. దేశ ప్రజల విముక్తి కోసం పోరాటం చేసి ఎన్నో హక్కులు సాధించి పెట్టిన మహనీయుల చరిత్రతో కాలెండర్ ముద్రించడం గొప్ప విషయమని అన్నారు. బహుజన మహావీరుల చరిత్రను న్యాయవాదులకు బోధించి చైతన్యం చేయాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ చట్టం, రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన న్యాయవాదులకు దేశ వాస్తవ చరిత్ర తెలియాల్సిన అవసరముందని, న్యాయ వాదులను చైతన్యం చేస్తే 90 శాతం బహుజన సమాజం చైతన్యం చెంది బహుజన రాజ్యాధికార పోరాటానికి బాటలు పడతాయని అన్నారు. ప్రపంచానికి విలువలు బోధించిన గౌతమ బుద్ధుడు, ఆధునిక భారత దేశంలో అణగారిన ప్రజలకు, మహిళలకు విద్యనందించి, సత్య బోధన చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, బ్రిటిష్ కాలంలోనే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందించి సామాజిక న్యాయానికి బాటలు వేసిన సాహు మహారాజ్, దేశంలో అడ్డమైన మూఢచారల వల్ల జరుగుతున్న దోపిడి నుండి బయట పడాలని స్వాభిమాన ఉద్యమం పునాదిగా బహుజన రాజకీయ ఉద్యమం చేసి ప్రపంచ మన్నలను పొందిన వీరుడు పెరియార్, సామాజిక అసమానతలపై యుద్ధం ప్రకటించి మెజార్టీ సమాజానికి భక్తితో పాటు విద్య బోధించి చైతన్యం చేసిన వీరుడు నారాయణ గురు, అసమానతలను తొలగించి సమసమాజ స్థాపనకు రాజ్యాంగంలో ఎన్నో హక్కులు పొందు పరచిన బాబాసాహెబ్ అంబేద్కర్, ఓటు ద్వారా బహుజన రాజ్య స్థాపనకు బాటలు వేసిన మాన్యశ్రీ కాన్షీరామ్ లతో పాటు బహుజన మహనీయులైన ఛత్రపతి శివాజీ, ఫాతిమా షేక్, సంత్ గాడ్గే బాబా, రమాబాయి, భాగ్యరెడ్డి వర్మ, రవిదాస్, సేవాలాల్ మహరాజ్, జల్కారీబాయి, బసవన్న, మారోజు వీరన్న, నంగేలి, అయ్యంకాళి, కబీర్ దాస్, సహీద్ ఉద్దంసింగ్, పూలన్ దేవి, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్న, యోగి వేమన రెడ్డి, కొండా లక్ష్మణ్ బాపూజీ, గురు నానక్, చాకలి ఐలమ్మ, జోగేంద్ర నాథ్ మండల్, సామ్రాట్ అశోకుడు, కొమరం భీమ్, బిర్సా ముండా, వీర బ్రహ్మేంద్రస్వామి ల పోరాట చరిత్రతో పాటు కాలరాం మందిర్ సత్యాగ్రహం, మహ్మద్ సత్యాగ్రహం, బీమాకోరేగాం వీరుల చరిత్ర, అంబేద్కర్ కుల నిర్మూలన చరిత్ర, పూలే చెప్పిన గులాంగిరి చరిత్ర, మూలనివాసి న్యాయవాద న్యాయవాద దినోత్సవం, బహిష్కృత కులాల సభ, పూలే స్థాపించిన సత్య శోదక్ సమాజ్ చరిత్ర, పూనా పాక్ట్, బౌద్ధ దీక్షా దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం, మనుస్మృతి దహన దినోత్సవం, బామ్ సెఫ్ ఆవిర్భావ దినోత్సవం చరిత్రలను ముద్రించిన కాలెండర్ బహుజన దిక్సూచిగా పని చేస్తుందని, బహుజన ఉద్యమాలకు గొప్ప స్ఫూర్తిని, శక్తిని అందిస్తుందని సాయిని నరేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, దయాల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పంచగిరి బిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జున్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్, హనుమకొండ, వరంగల్ బార్ ఐ ఎల్ పి ఎ కన్వీనర్లు పెండ్యాల అనిల్, పూసపాటి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ నాయకులు చింత సాంబశివరావు, రమాకాంత్, శశిరేఖ, శ్రీధర్ గౌడ్, నిర్మలా జ్యోతి, అరుణ, న్యాయవాదులు మల్లయ్య యాదవ్, నరింగరావు, లడె రమేష్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ప్రవీణ, సంధ్య, జె జె స్వామి, భవాని ప్రసాద్, జన్ను ప్రభాకర్, జార్జ్, సాంబయ్య, పద్మ, రేష్మ, బరుపటి వినయ్, సంధ్యలు పాల్గొన్నారు.

# ఐదవ ఇందిరాగాంధీ సీనియర్ మహిళా టీ20 ఉత్కంఠభరితం

- **ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లకు విజయాలు**





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఐదవ ఇందిరాగాంధీ సీనియర్ మహిళా టీ20 క్రికెట్ ఛాంపియన్షిప్‌లో భాగంగా ఈరోజు జరిగిన మ్యాచ్‌లు అభిమానులను ఉత్కంఠకు గురి చేశాయి. ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు మహారాష్ట్రపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. సానియా 46 పరుగులతో రాణించారు. లక్ష్య ఛేదనలో ఢిల్లీ జట్టు 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 162 పరుగులు చేసి విజయం సాధించింది. ప్రియాన్ పాండే 58 బంతుల్లో 78 పరుగులు చేసి వుమెన్ ఆఫ్ ద మ్యాచ్గా నిలిచారు. షేర్యా 52 పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్ యస్తిక 4 ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ వర్సెస్ తమిళనాడు జట్లు తలపడ్డాయి. ఉత్తరాఖండ్ జట్టు భారీగా 228 పరుగులు చేసింది. రూపాలి 113 పరుగులు చేసి అవుట్ అయ్యారు. లక్ష్య ఛేదనలో తమిళనాడు జట్టు విఫలమవ్వడంతో ఉత్తరాఖండ్ సునాయాసంగా విజయం సాధించింది.మూడో మ్యాచ్‌లో తెలంగాణపై ఉత్తరప్రదేశ్ జట్టు గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ క్రీడాకారిణి 63 బంతుల్లో 113 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ ఛాంపియన్షిప్‌లో మహిళా క్రికెటర్లు అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.

# ఖమ్మం వైఎస్సార్సీపీ అభిమానులపై కేసులు

**- వైయస్ జగన్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేసిన వైఎస్సార్సీపీ నాయకులు**

**- పార్టీ క్యాడర్‌కు అవసరమైన న్యాయ సహాయాన్ని అందించేందుకు వైఎస్సార్సీపీ లీగల్ సెల్ పూర్తిగా అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చిన జగన్**





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్‌ను ఆయన నివాసంలో గురువారం ఖమ్మం జిల్లా వైఎస్సార్సీపీ అభిమానులు కలిశారు. ఇటీవల వైయస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారన్న కారణంతో తమపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయడం, అందులో 11 మందిపై కేసులు పెట్టి 8 మందిని 13 రోజుల పాటు రిమాండ్‌కు పంపిన ఘటనను వారు వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంకు చెందిన ఓ మంత్రి, ఆయన తనయుడి ప్రమేయంతోనే పోలీసులు తమపై నాన్బెయిలబుల్ సెక్షన్లు బిగించి జైలుకు పంపారని వారు ఆరోపించారు. రాజకీయ కక్షతోనే ఈ కేసులు పెట్టారని, ప్రజాస్వామ్యబద్ధంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించినందుకే వేధింపులకు గురిచేశారని వైయస్ జగన్‌కు వివరించారు. వారి వాదనలు శ్రద్ధగా విన్న వైయస్ జగన్, తెలంగాణలో వైఎస్సార్సీపీ అభిమానులు, కార్యకర్తలు, పార్టీ క్యాడర్ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పార్టీ క్యాడర్‌కు అవసరమైన న్యాయ సహాయాన్ని అందించేందుకు వైఎస్సార్సీపీ లీగల్ సెల్ పూర్తిగా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. అక్రమ కేసులకు పార్టీ స్థాయిలో గట్టిగా పోరాడతామని తెలిపారు. వైఎస్సార్సీపీ సీనియర్ నేత పుత్తా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో ఖమ్మం జిల్లా అభిమానులు ఆలస్యం సుధాకర్, మర్రి శ్రీనివాస్, యర్రా నాగరాజు రెడ్డి, గంగారపు మురళీ, సరికొండ రామరాజు, గంగరబోయిన రవి, పగిళ్ళ నరేష్, ముదిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు





**తల్లాడ, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు గురువారం పలు శుభకార్యాలకు హాజరైనారు. ఈ కార్యక్రమాలకు అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు చిన్నారులను ఆశీర్వదించి, దీవించి అక్షింతలు వేశారు. భవిష్యత్తులో ఉన్నతమైన స్థితిలో నిలవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుంకర వెంకట నరసింహారావు సంధ్య దంపతుల కుమార్తె చిరంజీవి పవిత్రకు పట్టు వస్త్రాలంకరణ వేడుక అన్నారుగూడెంలో స్థానిక శ్రీ మహాలక్ష్మి కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. అదేవిధంగా బాలపేట గ్రామానికి చెందిన గొడ్ల సత్యం జ్యోతి దంపతుల కుమార్తె చిరంజీవి శ్రీ లక్ష్మికి పుష్పాలంకరణ వేడుక వారి కుమారుడు చిరంజీవి బాలాజీకి పంచ కట్టు వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాలలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, నాయకుల మారెళ్ళ దేవేందర్, పొన్నం కృష్ణయ్య, బాలపేట మాజీ ఉపసర్పంచ్ పూర్ణకంటి వెంకటేశ్వర్లు, మాజీ వార్డు మెంబర్ గొడ్ల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సుంకర రోశయ్య, నంద్యాల పుల్లయ్య, యువజన నాయకులు పేరసాని నరసింహారావు, గోన వేలాద్రి, సుంకర నాగేశ్వరరావు దిరిశాల బాబురావు, నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పుంగనూరు రూరల్ సిఐగా సాయి ప్రసాద్ నియామకం



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు : జనవరి 29 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు రూరల్ (చౌడేపల్లి) సర్కిల్ ఇన్స్పెక్టర్ గా సాయి ప్రసాద్ నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో తన ఛాంబర్ నందు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రాంభూపాల్ అనంతపురం వి.ఆర్ కు బదిలీ కాగా అదే జిల్లా తాడిపత్రిలో పనిచేస్తున్న సాయి ప్రసాద్ ఇక్కడికి నియమితులయ్యారు. న్యాయం కోసం వచ్చే బాధితులకు చట్టపరంగా వారికి రక్షణ కల్పిస్తానని ఆయన అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ను ప్రోత్సహిస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతానని. ఆయన తెలిపారు ఎస్సై నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సాయి ప్రసాద్ ను సన్మానించారు.

# జాతీయ రోడ్డు భద్రత మహోత్సవములలో భాగంగా...







**గంగాధర జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ఘర్ష గుర్తిలో ఈరోజు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా గంగాధర ఎస్.ఐ గారి ఆధ్వర్యంలో గర్శకుర్తిలో సరస్వతి హైస్కూల్ విద్యార్థినీ,విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రత పై అవగాహణ కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మిట్టపెల్లి రాజశేఖర్, ఉపాధ్యాయులు,పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగిందని ప్రిన్సిపల్ మాధవి తెలియజేశారు.

# మధురానగర్ సమ్మక్కసారలమ్మ జాతర వాలంటరీలకు గుండ సందీప్ ఆధ్వర్యంలో టీషర్ట్ల పంపిణీ



**గంగాధర జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలం మధురానగర్ లోని సమ్మక్క-సారలమ్మ జాతర సంధర్భంగా వాలంటరీ లకు మధురానగర్ మహేశ్వర మెడికల్ & జనరల్ స్టోర్స్ గుండ సందీప్ టీషర్ట్స్ ను ఆలయ కమిటీ మరియు పాలక వర్గ సభ్యుల ద్వారా అందజేయడం జరిగింది.ఆలయకమిటి తరపున గుండ సందీప్ కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# నేడే తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు...



**కరీంనగర్,జనవరి29(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జరుగున్నాయి. కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ భవనం లో జరుగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాటు చేశామని కరీంనగర్ జిల్లా నోడల్ ఆఫీసర్ కసుగంటి మాధవర రావు గురువారం తెలిపారు. జిల్లా లో 1217 మంది ఓటు హక్కు కల్గి ఉన్నారని, శుక్రవారం పోలింగ్ ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుసుకోవాలని, టైమ్ దాటిన వారిని అనుమతించమని అన్నారు. ఓటు వేసే వారు తమ వెంట బార్ కౌన్సిల్ ఇచ్చిన ఐడి కార్డు లేదా బార్ అసోసియేషన్ ఇచ్చిన కార్డు తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఓటు వేసే వారు మొబైల్ ఫోన్/కెమెరా/ట్యాబ్ ల పోలింగ్ కేంద్రంలో అనుమచించమని, ఓట్ల ప్రచారం చేసే వారు 500 మీటర్ల దూరం లో ఉండాలని, విఐపి లతో వెంట వచ్చే వారని లోనికి అనుమతించమని , ఈ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామని, ఈ ఎన్నికల్లో న్యాయ వాదులు తమ ఓటు హక్కు వినియోగించాలని నోడల్ ఆఫీసర్ తెలిపారు.

# కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో 25వ డివిజన్ నుంచి కటకం లోకేష్ నామినేషన్ దాఖలు..




**కరీంనగర్ టౌన్ జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 25వ డివిజన్ (సుభాష్‌నగర్) నుంచి బీజేపీ అభ్యర్థిగా కటకం లోకేష్ గురువారం తన నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 25వ డివిజన్ ప్రజల ఆశీస్సులు, మద్దతుతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ తరపున బరిలో నిలుస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం, డివిజన్ అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కటకం లోకేష్‌కు మద్దతు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని కటకం లోకేష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి ప్రముఖ ఫోటోగ్రాఫర్ శ్యామల హరిప్రసాద్..

● 22వ వార్డులో గులాబీ జెండా ఎగురవేస్తాం: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...



**హుజురాబాద్,జనవరి29(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ పట్టణ రాజకీయాల్లో బిఆర్ఎస్ పార్టీ మరోసారి తన బలాన్ని చాటుకుంది. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ తలకొక్కుల శ్యామల – హరిప్రసాద్ దంపతులు గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. హుజురాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. శ్యామల హరిప్రసాద్ వంటి ప్రజాదరణ కలిగిన వ్యక్తులు పార్టీలోకి రావడంవల్ల పట్టణంలో బిఆర్ఎస్ మరింత బలోపేతమైందని పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ. రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా 22వ వార్డులో బిఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ పార్టీకి సామాన్య ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సమన్వయంతో, చిత్తశుద్ధితో కృషి చేయాలని, శ్యామల హరిప్రసాద్ విజయానికి అండగా నిలవాలని సూచించారు. నిబద్ధతతో పనిచేసే నాయకులకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని, భవిష్యత్తులో వారికి నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జి ప్యానాల భూపతిరెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొల్లిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంగెం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు పోరెడ్డి శాంతన్ రెడ్డి, కట్కూరి మల్లారెడ్డి, చందా గాంధీ, వర్ధనేని రవీందర్ రావు, బొల్లు శ్రీనివాస్, ఆడెపు అనురాగ్, రాజు, అశోక్ తదితర ముఖ్య నేతలు పాల్గొని కొత్తగా చేరిన వారికి అభినందనలు తెలిపారు.



# ఆర్థిక ఇబ్బందులతో గడ్డి నివారణ మందు తాగి యువకుడు ఆత్మహత్య.... కాసేపటికి నన్ను కాపాడమని మిత్రుడికి ఫోన్



**అన్నమయ్య జిల్లా పుంగనూరు: జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన పుంగునూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. చౌడేపల్లి ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన సతీష్ (25సం) పుంగనూరులో ఉంటూ ఓ ప్రైవేటు పాల కంపెనీలో సాంకేతిక నిపుణుడిగా పనిచేసేవాడు. సొంత గ్రామమైన చిట్రెడ్డిపల్లిలో ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అప్పులు అధికంగా చేయడంతో ఆర్థిక ఇబ్బందులకు గురై తానా ఇండ్ల సమీపంలోని సచివాలయం వెనుక భాగంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మందు తాగిన తర్వాత అతని స్నేహితునికి తాను ఎక్కడున్నానో తెలిపి గడ్డి మందు తాగానని రక్షించాలని ఫోన్ ద్వారా సమాచారం తెలిపాడు. వెంటనే అతని స్నేహితుడు కుటుంబ సభ్యులతో వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సతీష్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుని తండ్రి రెడ్డి శేఖర్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# కరీంనగర్ 56వ డివిజన్‌లో తాటిపెల్లి శ్రీవాణి సుభాష్ నామినేషన్ దాఖలు..



**కరీంనగర్ టౌన్ జనవరి 29(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ 56వ డివిజన్ ప్రజల ఆశీస్సులతో, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తాటిపెల్లి శ్రీవాణి సుభాష్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనకు దైవ సమానులైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గారి ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ సమగ్ర అభివృద్ధినే ప్రథమ లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనతో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని అన్నారు. అలాగే, డివిజన్ ప్రజలందరికీ వినమ్రంగా నమస్కరిస్తూ, ఒక్కసారి అవకాశం ఇచ్చి కారు గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు.

# 50వ డివిజన్ బీజేపీ అభ్యర్థిగా బోయినపల్లి ప్రవీణ్ రావు నామినేషన్ దాఖలు





**కరీంనగర్ టౌన్ జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 50వ డివిజన్ (జ్యోతి నగర్, చైతన్యపురి) నుంచి బీజేపీ అభ్యర్థిగా బోయినపల్లి ప్రవీణ్ రావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 50వ డివిజన్ ప్రజల ఆశీస్సులు, ఆశీర్వాదాలతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ తరపున బరిలో నిలుస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు.


# సీఎం కప్ క్రీడా పోటీలు

**హన్మకొండ, జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):**

హసన్ పర్తి మండలానికి సంబంధించిన సీఎం కప్ క్రీడా పోటీలు జనవరి 30, 31 తేదీలలో (అర్బన్ లిమిట్) మరియు ఫిబ్రవరి 1, 2 తేదీలలో (రూరల్ లిమిట్) నిర్వహించనున్నట్లు మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి మరియు సీఎం కప్ మండల చైర్మన్ సుమన వాణి ఒక ప్రకటనలో తెలిపారు.అర్బన్ లిమిట్ కు సంబంధించిన పోటీలు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం, హనుమకొండ లో నిర్వహించ బడతాయని, రూరల్ పరిధికి సంబంధించిన పోటీలు కిట్స్ కాలేజ్, ఎర్రగట్టుగుట్ట లో జరుగుతాయని వివరించారు. సీఎం కప్ పోటీల్లో హసన్ పర్తి కార్పొరేషన్ పరిధిలోని యువకులు, పిల్లలు, మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. మండల స్థాయిలో (అర్బన్ లిమిట్ ) కింద పేర్కొన్న క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు.ప్రధాన క్రీడలు :అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగ, చెస్, కరాటేఇతర క్రీడలు : క్యారమ్, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, జూడో, కిక్ బాక్సింగ్, నెట్ బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, ఉషు, జిమ్నాస్టిక్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, సాఫ్ట్ బాల్, టైక్వాండో, పారా గేమ్స్ తదితర క్రీడలు ఉంటాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు తప్పనిసరిగాజనవరి 30, 31 తేదీలలో ఉదయం 9 గంటల లోపు అర్బన్ లిమిట్ కు జె ఎన్ ఎస్ స్టేడియం, హనుమకొండలో తమ ఆధార్ కార్డు ధృవ పత్రం లేదా సీఎం కప్ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్మెంట్తో హాజరు కావాలని సూచించారు. సీఎం కప్ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్మెంట్‌ను https://satg.telangana.gov.in/cmcup/ లింక్ ద్వారా "ఐశీఒఅశ్రీశ్ఱుంం" విభాగంలో తమ మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి పొందవచ్చని తెలిపారు.అలాగే, పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమకు అవసరమైన క్రీడా వస్తువులు, ఆహార పదార్థాలు, వ్యక్తిగత సామగ్రి స్వయంగా తీసుకురావాలని కూడా సూచించారు.ఈ సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి ప్రతి క్రీడాకారుడు, క్రీడాభిమానులు సహకరించాలని సుమన వాణి విజ్ఞప్తి చేశారు.

# “ఇండియా విముక్తి మార్గమే ప్రపంచానికి రహదారి“

ఇండియాలో బ్రాహ్మణిజంతో కూడిన భావజాలానికి వ్యతిరేకంగా బాణం ఎక్కుపెట్టిన కామ్రేడ్ మారోజు వీరన్నను ఆదిలోనే గుర్తుపట్టి గుట్టుచప్పుడు కాకుండా రాజ్యం హత్య చేసింది. కానీ! కామ్రేడ్ మారోజు వీరన్న పెట్టిన మంట ఇప్పటికి మండుతూనే ఉన్నది మండుతూనే ఉంటది. భారత విప్లవ ఉద్యమంలో ఒక మైలురాయి సమ సమాజ మార్పు కావాలని ఈ దేశంలో సమాన హక్కులు కావాలని సమానత్వం కావాలని దున్నేవారికి భూమి అడవి పైన ఆదివాసులకు సర్వహక్కులు కావాలని 1/70 చట్టాన్ని అమలు చేయాలని జల్, జంగిల్, జమీన్, సర్వాధికారులు ఆదివాసులకే దక్కాలని తన కులం పైన ఇంకో కులం దోపిడీ చేయకుండా కలిసి సమానత్వం కావాలని పోరాడుతున్న తరుణంలో కామ్రేడ్ మల్యాల సమ్మన్న అలియాస్ గుట్టన్న సిపిఐ ఎంఎల్ జనశక్తి పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగి ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ సభ్యుని స్థాయికి ఎదగడం జరిగింది. ఈ దేశంలో విప్లవం ఎందుకు రావట్లేదు అని తనకు తాను ప్రశ్నలు వేసుకొని ఈ దేశంలో వర్గ దోపిడీతో పాటు కుల దోపిడీ కూడా ఉన్నది. కులాన్ని పునాదిగా చూడకుండా ఉపరీతలంగా చూసినంత సేపు ఈ దేశంలో విప్లవం విజయవంతం కాదని గ్రహించినటువంటి గుట్టన్న కామ్రేడు మరోజు వీరన్న ఒక సైద్ధాంతిక చర్చ జనశక్తి పార్టీలో తీసుకురావడం జరిగింది. కారంచేడు,చుండూరు,వేంపేట సంఘటనలను అధ్యయనం చేసి ఈ దేశంలో విప్లవం విజయవంతం కావాలంటే కామ్రేడ్ మరోజు వీరన్న తీసుకొచ్చినటువంటి కులవర్గ పోరాటల సిద్ధాంతం ద్వారానే ఈ దేశంలో విప్లవం విజయవంతం అవుతుందని బలంగా నమ్మిన వాడు కామ్రేడ్ గుట్టన్న. ఆ తరువాత సిపిఐ (ఎమ్ ఎల్) జనశక్తి మే (సెవెటీన్త్ )కు వీరన్న వర్గంలో చేరడం జరిగింది. ఆ తర్వాత తాను ఒక టెక్నికల్ పని మీద బయటకు రావడంతో అది పసికట్టినటువంటి విప్లవ ద్రోహి సమాచారంతో పోలీసులు పట్టుకొని కామ్రేడ్ గుట్టన్నను భూటకపు ఎన్ కౌంటర్లో కాల్చి చంపడం జరిగింది. ప్రజలు నిర్మాణం చేసుకున్న కామ్రేడ్ గుట్టన్న స్థూపాన్ని ఇవాళ ఎరుపు రంగు వేయకుండా మంత్రి సీతక్క పచ్చ కలరు వేయించడం ఎంత వరకు సమంజసం. కామ్రేడ్ గుట్టన్న ఆదివాసి విముక్తితో పాటు అన్ని కులాలను ఐక్యం చేస్తూ సమానత్వం కోసం కుల జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వాళ్లకు దక్కాలని పోరాడినటువంటి గొప్ప వ్యక్తి కామ్రేడు గుట్టన్న. అలాంటి వ్యక్తిని కేవలం సీతక్క స్వార్థం కోసం ఆదివాసి కులానికి పరిమితం చేయటం ఎంతవరకు సమంజసం. అగ్రకులాల మెప్పు పొందడం కోసం ఆదివాసీ అమరుల చరిత్రను ప్రజలకు తెలియకుండా చర్చించకుండా మాట్లాడకుండా ఇలా చేయటమే అగ్రకుల మనువాద బ్రాహ్మణులు చేస్తున్న కుట్ర. ఇప్పటికైనా సీతక్క వాస్తవాలు గ్రహించాలని విజ్ఞప్తి చేస్తూ వారి త్యాగాలను ప్రజలకు వివరించాలని మీరు అనుకుంటే అదే జాతరలో గోదావరి లోయ అమరుల ఎగ్జిబిషన్ పెడితే చాలా బాగుండేది. ఇప్పటికే మన కోసం మన జాతి కోసం ఎందరో త్యాగజనులు పోరాటాశీ చేసిన అమరుల త్యాగాలను వాళ్ల చరిత్రను తెలియకుండా అగ్రకుల మనువాద బ్రాహ్మణులు కాలగర్భంలో కలిపేసినారు. అంటే మన చరిత్రను మరో తరానికి తెలియకుండా కుట్రలు చేసినారు. అందుకే బిరుసముండా, కొమరం భీమ్,అల్లూరు సీతారామరాజు,పగిడిద్దరాజు కాకతీయ రాజుల మీదికి యుద్ధాన్ని చేసినటువంటి గొప్ప వీరవనితలు మన సమ్మక్క సారలమ్మ. వాళ్ళ పోరాట వారసత్వాన్ని ఆదివాసీ స్వయం పాలన కోసం ఆదివాసీ హక్కుల కోసం మా గూడెంలో మా రాజ్యం కోసం పోరాడినటువంటి గుట్టన్నతో పాటు దనసరి సాంబన్న, ఊకె స్వరూపక్క, రంగన్న గోపన్న ఇలా ఎందరో ఆదివాసీ చరిత్రను ఒక కార్యక్రమం ద్వారానో లేక ఒక ఎగ్జిబిషన్ ద్వారానో తెలియజేయకుండా ఆదివాసీ పోరాట తత్వాన్ని ప్రజలకు వివరించకుండా వాళ్ల గురించి ఎవరు మాట్లాడకుండా చేయటమే ఆ స్థూపానికి పచ్చ కలరు వేయడం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చతిస్గడ్, బస్తర్, మహారాష్ట్ర అడవులను






జల్లెడ పడుతూ అక్కడ ఉన్నటువంటి ఆదివాసులను వారి యొక్క గూడాలను ఆనవాళ్లు లేకుండా ఖాళీ చేయటం జరుగుతుంది. ఆదివాసీ బిడ్డలు తరువాత తరానికి ఇది మన పూర్వికుల ప్రాంతామని వాళ్ల పిల్లలకు వాళ్ళ ఆనవాలు లేకుండా చేస్తున్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి అనే నాటకంతో అంబానీ,ఆదాని మైనింగ్ మాఫియాతో దోపిడీ చేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తుంది. ఆదివాసీల త్యాగాలను ఎందుకు మరుగున పడేస్తున్నారు. ఎవరి మెప్పుకోసం ఎవరి స్వార్థం కోసం. ఇవాళ అదే గుట్టన్న చేసిన పోరాటాన్ని చేసినటువంటి ఆలోచన విధానాన్ని ఆయనతో పాటు ఎంతోమంది ఆదివాసులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని స్వయం పాలన కావాలని ఇవ్వాళ ధనసరి సాంబన్న రంగన్న,గోపన్న ఊకె స్వరూపక్క వరకు ఇలా చెప్పుకుంటు పోతే ఎంతోమంది అమరుల తమ వేడి నెత్తురు చిందించి దళిత బహుజన జనత ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడినటువంటి గొప్ప వీరుల వాస్తవాలను చెప్పకుండా మన త్యాగాలను కనుమరుగు చేయడశీ కుట్రలో భాగమే ఆ స్థూపానికి పచ్చ కలరు వేయడం దాన్ని తీవ్రంగా ఖండిస్తూ త్వరలో సిపియుఎస్ఐ పార్టీ ఆధ్వర్యంలో ఎరుపు రంగు కలర్ వేసి గుట్టన్నతో పాటు ఆ ప్రాంతం ముద్దుబిడ్డనటువంటి దనసరి సాంబన్న త్యాగాలను ప్రజలకు తెలియజేస్తాం. అన్ని విప్లవ పార్టీలు ఐక్యమై ముందుకు రావాలసిన తక్షణ అవసరం ఉన్నది.

**- ధైద వెంకన్న సిపియుఎస్ఐ పార్టీ (దళిత బహుజన శ్రామిక విముక్తి ) డిబిఎస్వి. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి.ట గురు మిల్ల రాజు,ఊ సామాజిక కార్యకర్త.**

# వంద శాతం పిల్లల పఠనా సామర్థ్యం పెంచాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి పిల్లవాడికి వంద శాతం ఇంగ్లీష్ పఠనా సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఎవ్రీ చైల్డ్ రీడ్స్ (ఇఎస్ఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు.గురువారం స్థానిక శ్రీ భక్తరామదాసు కళాక్షేత్రంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌లతో కలిసి విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఇఎస్ఆర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా విద్యార్థుల పఠనా సామర్థ్య ఫలితాలను సమీక్షించి, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు గంటసేపు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ తరగతులు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఫోనెటిక్స్ పద్ధతిలో ప్రతి అక్షరం చేసే శబ్దాన్ని పిల్లలకు స్పష్టంగా నేర్పాలని, టీచర్ ఆక్టివిటీ, స్టూడెంట్ ఆక్టివిటీ, కథల ద్వారా పిల్లలను చదువుకు ఆకర్షించాలని అన్నారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థుల హాజరు పెరిగిందని, ఇది పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే నైపుణ్యమని తెలిపారు. రాబోయే నెలలో 75 శాతం విద్యార్థులకు వ్యాఖ్యలు చదివే సామర్థ్యం రావాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. యూడీఐఎస్‌తో అనుసంధానమైన యాప్‌లో ప్రతి బుధవారం విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ అప్‌డేట్ చేయాలని సూచించారు. ఫిబ్రవరి నెల కీలకమని, వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎఫ్ఎల్ఎం అమలు, ఎఫ్ఎల్ఎస్ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం అనంతరం కార్యక్రమం అమలులో మంచి ప్రతిభ కనబరిచిన







ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులను సన్మానించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షారైనా, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కనకం యాదగిరి మృతి దళిత ఉద్యమానికి తీరనిలోటు

- డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్



**హన్మకొండ,జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హసన్ పర్తి మండల కేంద్రములో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు, ప్రముఖ అంబేద్కర్ వాధి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నాయకుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృదు స్వభావి, స్నేహభిలాషి కనకం యాదగిరి సార్ మృతి దళిత ఉద్యమానికి తీరని లోటని,యాదగిరి సార్ అలోచన విధానాన్ని, ఆశయాలను కొన సాగించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రమేష్ కుమార్, రాజేందర్ మాట్లాడుతూ యాదగిరి సార్ చిన్నతనం నుండే అంబేద్కర్ అలోచనలతో గ్రామ గ్రామాన అంబేద్కర్ యువజన కమీటిలను ఏర్పాటు చేస్తూ అంబేద్కర్ వాధాన్ని ప్రతి పల్లేకు పరిచయం చేశాడన్నారు.ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, సాయిలు పాల్గొన్నారు.

# క్యాట్ లెవెల్-2 ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచిన రామాంతాపూర్ శ్రీ చైతన్య విద్యార్థులు

- అభినందన తెలియజేసిన మొగల్నూర్ మహమ్మద్ అలీ




**ఉప్పల్ జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ చైతన్య స్కూల్ రామంతాపూర్ విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన క్యాట్ లెవెల్-2 పరీక్షలో అత్యున్నత ప్రతిభను కనబరిచారు. క్యాట్ లెవెల్ పరీక్షలో మొత్తం 89 మంది విద్యార్థులు పాల్గొనగా 13 మంది విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెడల్ మరియు ప్రశంసా పత్రాలు, 52 మంది విద్యార్థులకు మెడల్ మరియు ప్రశంసా పత్రాలు, 24 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించాయి.నారాయణగూడ జోన్ ఏ.జి. యం. మొగల్నూర్ మహమ్మద్ అలీ విద్యార్థులకు అభినందనలు తెలియ జేస్తూ, శ్రీ చైతన్య విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో నెంబర్ వన్ గా నిలుస్తూ సంస్థ కీర్తిని అన్ని దిక్కులా వ్యాప్తి చేస్తున్నారని ప్రశంసించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చక్కటి శిక్షణ, నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయుల బోధన వలనే ఇలాంటి ఉత్తమమైన ఫలితాలు సాధ్యమైనాయని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్స్ పాల్ శ్రీ కీర్తి కోన మాట్లాడుతూ ఇప్పటికి, ఎప్పటికి ఒలింపియాడ్ రారాజు శ్రీ చైతన్య విద్యాసంస్థలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బహుమతుల ప్రధానోత్సవంలో ఆర్.ఐ. వెంకటేశ్ , జోనల్ కో ఆర్డినేటర్స్ పుల్లారావు , రాజేంద్ర ప్రసాద్, డీన్ నాగరాజు, ఐపియల్, సిబ్యాచ్ ఇంచార్జులు వెంకటేశ్ గుప్త,అరుణ్ కుమార్, ఒలింపియాడ్ ఇంచార్జులు వెంకన్న, వంశిశ్రీ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలి

- వన్ మ్యాన్ ఆర్మీ బి. శంకర్‌ను గెలిపించండి: సీనియర్ అడ్వకేట్ కాసుల వినోద్






**హైదరాబాద్ జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో విఫలమైతే న్యాయం తిరస్కరించబడుతూనే ఉంటుందని, అందువల్ల సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలని సీనియర్ అడ్వొకేట్ కాసుల వినోద్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీ చేస్తున్న బి.శంకర్ కు మద్దతుగా న్యాయవాదులతో కలిసి గురువారం ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు నేడు న్యాయం కోసం నిలబడకపోతే, మనకు ఇంకెప్పుడూ అవకాశం రాకపోవచ్చునని అన్నారు. తన దైర్యం సమగ్రతను ఇప్పటికే నిరూపించుకున్న నాయకుడు శంకర్ కు మీ విలువైన ఓటును వేయాలని ఆయన న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. వన్ మ్యాన్ ఆర్మీ బి. శంకర్ ఇతరులు మౌనం వహించాలని నిర్ణయించినప్పుడు బి. శంకర్ లేచి నిలబడి న్యాయం కోసం తన గొంతును పెంచాడు.న్యాయవాదులు కష్టపడి సంపాదించిన సంక్షేమ నిధులు దుర్వినియోగం మరియు మోసం జరిగినప్పుడు ఆయన బార్ కౌన్సిల్‌కు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడారు. ఈ నిధులు మన భద్రత కోసం ఉద్దేశించబడ్డాయి. ప్రైవేట్ జేబులు నింపడానికి కాదు.న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో విఫలమైతే, న్యాయం తిరస్కరించబడుతూనే ఉంటుంది. ఇది తెలివిగా ఎంచుకోవలసిన సమయం గుడ్డిగా కాదు, ఎవరైనా తెలిసినవారు లేదా సుపరిచితులు కాబట్టి. అభి నహి, తో కభి నహి.ఇప్పుడు కాకపోతే, ఎప్పుడు?మనం నేడు న్యాయం కోసం నిలబడకపోతే, మనకు ఇంకెప్పుడూ అవకాశం రాకపోవచ్చు. తన ధైర్యం మరియు సమగ్రతను ఇప్పటికే నిరూపించుకున్న నాయకుడికి మీ విలువైన ఓటును ఇవ్వండి.బి.శంకర్‌కు ఓటు వేయండి వన్ మ్యాన్, వన్ మిషన్, వన్ ఓటు వేయాలని కాసుల వినోద్ కోరారు.

## బీసీ రిజర్వేషన్‌గా మార్చాలంటూ హైకోర్ట్ ఆదేశం

**మహబూబ్ నగర్ జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ రిజర్వేషన్ మార్చాలంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖల చెయ్యడం జరిగింది. ఈ నేపథ్యంలో పిటీషనర్ నవీన్ కుమార్ గౌడ్ తరపున కోర్టులో హైకోర్టు సీనియర్ న్యాయవాదులు జీ.కరుణాకర్ రెడ్డి, వై. హేమంత్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిటిషనర్ నవీన్ కుమార్ గౌడ్ తరపున వాదనలు వినిపించిన బీసీ జనాభా ఎక్కువగా ఉండగా అక్కడ ఎస్టి రిజర్వేషన్ ఇవ్వడంతో దానిని మార్చాలంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా ఇరువురి వాదనలు విన్న అనంతరం హైకోర్టు న్యాయమూర్తి తక్షణమే బీసీ రిజర్వేషన్ గా మార్చాలంటూ సంబంధిత అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగింది,

# పొదుపు సంఘాలకు బ్యాంక్ లావాదేవాలపై అవగాహన సదస్సు

● గ్రామాలలో వి.ఎస్.ఆర్ గ్రామీణ మీడియా కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమం

**సత్తుపల్లి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో సత్తుపల్లి శాఖ మేనేజర్ రమేష్ సారధ్యంలో మండల పరిధిలోని కిష్టారం, యాతాల కుంట, రేజర్ల గ్రామాలలో పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వి.ఎస్.ఆర్ గ్రామీణ మీడియా కళాకారుల బృందంతో వేదికను ఏర్పాటుచేసి వినియోగదారులకు అర్థమయ్యే రీతిలో దృశ్య రూపకంగా బ్యాంకు రుణాలు, లావాదేవీలను వివరించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి శాఖ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ పొదుపు సంఘాలు బ్యాంకు ఖాతా నుండి జరిపే లావాదేవీలు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ పథకాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్.బి.ఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఫీల్డ్ ఆఫీసర్ మారోజు తరుణ్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వినియోగదారులకు అందించే గోల్డ్, క్రాఫ్, హౌసింగ్, డ్వాక్రా రుణాలపై వడ్డీ రాయితీలను వివరించారు.





ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఓటిపి లను ఇతరులకు పంపించకూడదని సూచించారు. డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలే గద్దరన్న వారసులు

● డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్



**హన్మకొండ, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా యుద్ధ నౌక గద్దరన్న 78 వ జయంతి ఉత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు గద్దరన్న పౌండేషన్ ఆద్వర్యంలో ఈనెల 31 న హైదరాబాద్ రవీంద్ర భారతిలో సాయంత్రం గద్దరన్న 78వ. జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని ఈ జయంతి ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ వాధులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, మేధావులు, కార్మికులు, కర్షకులు హాజరై విజయవంతం చేయాలని, ప్రజలే గద్దరన్న వారసులని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు.గురువారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహా సెంటర్‌లో ప్రజా యుద్ధ నౌక గద్దరన్న 78వ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ కుమార్, చుంచు రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు గద్దరన్న చేసిన కృషి మరవ లేనిదని, పూలే, అంబేద్కర్, బుద్ధుని ఆలోచన విధానంతో దేశవ్యాప్తంగా ఉద్యమించిన మహానుభావుడు గద్దరన్న అన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు గాజాల గొవర్ధన్, బొడ్డు కుమారస్వామి (బికే),పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షులు కేడల ప్రసాద్, డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత,జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, సాయి, రాజు, కిరణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలి

- వడ్డెరలకు 10 వేల కోట్ల రూపాయలు కేటాయించి ఆదుకోవాలి
- ప్రతి డివిజన్ నందు వడ్డెర సొసైటీలకు 2 కోట్లరూపాయలు రుణాలు ఇవ్వాలి
- వడ్డే ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ సోమరజ్, ఖమ్మం జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు బత్తుల వీరబాబు డిమాండ్

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర ప్రజల విద్య,ఉపాధి అవకాశాల అభివృద్ధి కోసం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఒడ్డె ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ సోమరాజ్, వడ్డెర సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బత్తుల వీరబాబు డిమాండ్ చేశారు. ఖమ్మం నియోజకవర్గం అధ్యక్షులు కుంచపు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వల్లెపు సోమరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర యవతకు ఉపాధి కల్పన కోసం వడ్డెర కార్పొరేషన్ ద్వారా 70% సబ్సిడీతో రుణాలు మంజూరు చేసి జేసిపిలు, క్వారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో గత ఉమ్మడి రాష్ట్రంలో వడ్డెర సొసైటీలకు 15% రిజర్వేషన్ లు ఉండేవని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వడ్డెర సొసైటీల రిజర్వేషన్లను తొలగించి వడ్డెర్లకు తీరని అన్యాయం చేశారని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ హామీలో భాగంగా వడ్డెర్ల వృత్తిలో భాగంగా ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 15% రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రతి గ్రామంలో ఉన్న వడ్డెర సొసైటీలకు రెండు కోట్ల రూపాయల రుణాలను ఇవ్వాలనే డిమాండ్ తో తెలంగాణ వడ్డెర జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. **57వ డివిజన్ కమిటీ ఎన్నిక** 57వ డివిజనందు వడ్డెర సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 57వ డివిజన్ అధ్యక్షుడిగా అలకుంట ఎల్లయ్య , కార్యదర్శిగా సంపంగి రాములు, ఉపాధ్యక్షులుగా గోగుల మల్లేష్, దండగుల మధు, కమిటీ సభ్యులుగా సంపంగి రాజా, ఆలకుంట్ల వెంకన్న, దండగల రమేష్, అలకుంటరాములు, వల్లెపు వెంకన్న, ఆలకుంట నాగేశ్వరరావు, ఆలకుంట శ్రీను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంపంగి మల్లయ్య, అలకుంట రవి, సంపంగి లక్ష్మయ్య, మంగయ్య, వల్లెపు మంగయ్య, బత్తుల కోండలరావు, వీరబాబు, చల్లా శివ, బత్తుల శ్రీను, అలకుంట రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# మేఘన హాస్పటల్ హెల్త్ క్యాంపును ప్రారంభించిన సర్పంచ్ బిల్లా యాదగిరి





**హన్మకొండ, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :**వేలేరు గ్రామం క్యాథలిక్ చర్చిలో ఎర్ర కిరణ్ ఫాదర్ ఆధ్వర్యంలో హనుమకొండ కు చెందిన మేఘన మల్టీస్పెషల్టి హాస్పిటల్ వారిచే ఉచిత గుండె, కంటి, షుగర్, ఇతర పరీక్ష శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ బిల్లా యాదగిరి, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ పాల్గొని హెల్త్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలేరు గ్రామంలో ఉచిత హెల్త్ పరీక్షలు నిర్వహించడానికి సహకరించిన ఫాదర్ కిరణ్ కి, మేఘన మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ చైర్మన్ మేఘన కి అభినందనలు, ధన్యవాదలు తెలియజేస్తూ ఈ క్యాంపులో సుమారు 280 మంది ఉచిత పరీక్షలు చేసుకోవడం జరిగింది. త్వరలో వేలేరు గ్రామ పంచాయతీలో హెల్త్ క్యాంపు ను కూడా నిర్వహించడం జరుగుతుందని ఇలాంటి హెల్త్ క్యాంపుల ను గ్రామ ప్రజలు వినియోగించు కోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, మేఘన హాస్పటల్ డాక్టర్స్, వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరుగుతున్న అగ్రంపహాడ్ సమ్మక్క సారక్క జాతర

● జాతరలో కొలువుదీరిన సమ్మక్క సారక్క ● అన్ని వసతులు ఏర్పాటు చేశాం: ఈఓ నాగేశ్వరరావు

**హన్మకొండ,జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం శ్రీ సమ్మక్క సారక్క జాతర ఎంతో ఘనంగా అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా ఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో కొన్ని లోటుపాట్లు లైటింగ్ పారిశుధ్యం చిన్న చిన్న లోపాలు జరిగాయని దీన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో లా జరగకుండా ఈసారి మెరుగైన వసతులను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి తెలియజే యగా వారి ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ సమక్షంలో ఆల్



డిపార్ట్మెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మరుగుదొడ్లు, త్రాగునీరు ఇలా అన్ని వసతులను ఏర్పాటు చేశామని పంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ చెట్లను తొలగించి కూడలిలో దారి ఏర్పాటు చేసి మరియు కార్మిక సిబ్బంది వెంట వెంటనే భక్తులకు శుభ్రత ఉండే విధంగా దృష్టి పెట్టామన్నారు నిరంతరం కరెంటు ఉండే విధంగా ఎలక్ట్రిసిట్ డిపార్ట్మెంట్ సహకారం తీసుకుంటున్నామన్నారు క్యూలైన్స్ 100/- మరియు 500 ఉన్న క్యూ లైన్ 200 కే వృద్ధులకు



వితంతువులకు ప్రత్యేకంగా దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు ఆర్టీసీ వారి సహకారం తీసుకొని వెంట వెంటనే వచ్చే భక్త జనాన్ని వారి గమ్య స్థానానికి చేరే విధంగా ఏర్పాటు చేశామన్నారు ముఖ్యంగా పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయ ప్రాంగణంలో మరియు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు శ్రీ సమ్మక్క సారక్క జాతరకు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో సుమారు 12 లక్షల వరకు భక్తులు వచ్చారని ఈసారి గతం కంటే ఎక్కువ మంది భక్తులు ఈ సమ్మక్కసారక్క జాతరను దర్శించు కోబోతున్నారని అన్నారు.

# 5వ ఇందిరాగాంధీ సీనియర్ ఉమెన్ టి20 మ్యాచ్ ప్రారంభం

● టాస్ వేసి మ్యాచ్‌కు శుభారంభం చేసిన ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షుడు పేరం యశ్వంత్





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని ఎస్.ఆర్ అండ్ బీజీఎన్ఆర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 5వ ఇందిరాగాంధీ సీనియర్ ఉమెన్ టి20 క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా తెలంగాణ వర్సెస్ ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన కీలక మ్యాచ్‌కు టాస్ వేసి ప్రారంభించినట్లు ఖమ్మం ఎన్.ఎస్.యూఐ నగర అధ్యక్షుడు పేరం యశ్వంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా క్రీడాకారులు అన్ని రంగాల్లో ముందుకు రావడం అభినందనీయమని, క్రీడలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతీ క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూఐ జిల్లా నాయకుడు మలోత్ ఈశ్వర్ సాయితో పాటు పలువురు ఎన్.ఎస్.యూఐ నాయకులు, క్రీడాభిమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు. మ్యాచ్‌ను ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభించడంతో గ్రౌండ్ క్రీడాకళతో కళకళలాడింది.

# కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలు 2026: ఎంఐఎం తొలి జాబితా విడుదల..



**కరీంనగర్ టౌన్ జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2026 ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం పార్టీ తన తొలి అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో నలుగురు అభ్యర్థులకు పార్టీ అధికారికంగా బీ-ఫారంలను అందజేసింది. ఎంఐఎం పార్టీ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, ఉమ్మడి జిల్లా ఎన్నికల పరిశీలకుడు, ఇంచార్జి యాసర్ అర్ఫాత్ అభ్యర్థులకు బీ-ఫారంలను అందజేశారు. ఈ తొలి జాబితాలో ఎంపికైన అభ్యర్థులు: 43వ డివిజన్ (గోదాం గడ్డ): ఖాన్ షా, 37వ డివిజన్ (శాసహాబ్ మొహాళ్ల): అహ్మద్ మొహియుద్దీన్ బాబు జానీ, 60వ డివిజన్: నసీం సుల్తాన ఇబ్రహీం (అడ్వకేట్), 61వ డివిజన్ (కశ్మీర్ గడ్డ, రైతు బజార్): ఆతిఫ్ ఆతిన మున్సిపల్ ఎన్నికల్లో బలమైన పోటీకి సిద్ధమవుతున్న ఎంఐఎం పార్టీ, తొలి జాబితా విడుదలతో రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. త్వరలో మరిన్ని అభ్యర్థుల జాబితాలను విడుదల చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# సూసైడ్ చేసుకొని కానిస్టేబుల్ మృతి...

**పర్వతగిరి ,జనవరి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని సీత్య తండాకు చెందిన రమావత్ అనిత హనుమకొండ హెడ్ క్వార్టర్స్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి వేధిస్తుంటే ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ ఈరోజు మృతి చెందారు.



# ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా మంత్రి కొండా సురేఖ






**● కన్వీనర్లుగా నూతి సత్యనారాయణ, తోట దేవి ప్రసన్న, నాగండ్ల దీపక్ చౌదరి ● మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ● లోకల్ బాడీ ఎన్నికల్లో పట్టు సాధించడమే లక్ష్యం**

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల ఎన్నికలను రాజకీయంగా అత్యంత కీలకంగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కమిటీ చైర్మన్‌గా నియమించడం వెనుక పార్టీ అధిష్టానం స్పష్టమైన రాజకీయ ఉద్దేశం ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకమైన శాఖను నిర్వహిస్తూ, ఖమ్మం జిల్లా రాజకీయాల్లో బలమైన పట్టున్న కొండా సురేఖకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా, పార్టీ లోపలి విభేదాలకు చెక్ పెట్టడం, అలాగే అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత తీసుకురావాలనే సంకల్పం కనిపిస్తోంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపుల రాజకీయాలు, అసంతృప్తుల కారణంగా పార్టీకి నష్టం వాటిల్లిన నేపథ్యంలో, ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడడమే ప్రధాన లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. కమిటీ కన్వీనర్లుగా నియమితులైన నూతి సత్యనారాయణ గౌడ్, తోట దేవి ప్రసన్న, నాగండ్ల దీపక్ చౌదరి ముగ్గురూ తమ తమ జిల్లాలు, పట్టణాల్లో పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న నాయకులుగా గుర్తింపు పొందారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మధ్య సమన్వయం మెరుగుపడేందుకు వీరి నియామకం దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో యువత, మధ్యతరగతి ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉందని పార్టీ భావిస్తోంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, అశ్వరావుపేట, కొత్తగూడెం వంటి మున్సిపాలిటీలతో పాటు మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను స్థానిక సంస్థల స్థాయిలో నిలబెట్టుకోవడం, అలాగే అధికార పార్టీగా ప్రజల నమ్మకాన్ని మరింత బలపర్చడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన సవాలుగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరుతున్నాయా లేదా అన్నది ఈ మున్సిపల్ ఎన్నికల్లో కీలక అంశంగా మారనుంది. ఈ నేపథ్యంలో ప్రజల మధ్య నిత్యం ఉండే, స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన అభ్యర్థులనే ఎంపిక చేయాలన్న దిశగా స్క్రీనింగ్ కమిటీ కసరత్తు చేయనుందని తెలుస్తోంది. టికెట్ల పంపిణీలో గెలిచే అవకాశం ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇదిలా ఉండగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి వస్తున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ పట్టణ రాజకీయాల్లో తన బలాన్ని చాటాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఖమ్మం పార్లమెంట్ పరిధిలో పట్టణ ప్రాంతాల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో, అభ్యర్థుల ఎంపికే తుది ఫలితాన్ని నిర్ణయించే అంశంగా మారుతుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, మంత్రి కొండా సురేఖ నాయకత్వంలో ఏర్పడిన ఈ స్క్రీనింగ్ కమిటీ, పార్టీ అంతర్గత సమన్వయం, గెలుపు సాధించే అభ్యర్థుల ఎంపిక, సమర్థవంతమైన ప్రచార వ్యూహాల ద్వారా ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం తీసుకురావడమే లక్ష్యంగా పని చేయనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మున్నేరు జలాల మళ్లింపు: గిరిజన గొంతుకపై 'లింక్' కత్తి!

తెలంగాణ జల వనరుల చిత్ర పటంలో 'మున్నేరు' కేవలం ఒక నది మాత్రమే కాదు, ఉమ్మడి ఖమ్మం మరియు వరంగల్ జిల్లాల సరిహద్దు ప్రాంతాలైన మహబూబాబాద్, ఇల్లందు, డోర్నకల్ నియోజకవర్గాల రైతాంగ ఆశల రేఖ. అరవై ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఈ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు, నేడు ప్రభుత్వం తీసుకున్న "మున్నేరు–పాలేరు లింక్ కెనాల్" నిర్ణయం కోలుకోలేని దెబ్బగా మారింది. ఇది కేవలం నీటి తరలింపు కాదు, ఒక ప్రాంత అభివృద్ధిని అణచివేసే "ప్రాంతీయ వివక్ష" అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ లింక్ కెనాల్ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తుంది. PESA (Panchayats Eltension to Scheduled Areas) చట్టాన్ని ఉల్లంఘిస్తుంది. భారత రాజ్యాంగం 5వ, షెడ్యూల్ ద్వారా గిరిజన ప్రాంతాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను ఈ ప్రాజెక్టు తుంగలో తొక్కుతోంది. పంచాయతీల షెడ్యూల్ ప్రాంతాల విస్తరణ చట్టం 1996 డిసెంబర్ 24 1996 ను అమలులోకి వచ్చింది ఇది గిరిజన తెగల సాంప్రదాయ పాలన ఆచారాలు భూమి నీరు మరియు గ్రామ సభలకు చట్టపరమైన స్వయం ప్రతిపత్తి స్వయం పాలన కల్పిస్తుంది 73 వ రాజ్యాంగ సవరణలు ఐదవ షెడ్యూల్ ప్రాంతాలకు వర్తింపజేస్తూ భూరియా కమిటీ సిఫార్సుల మేరకు ఈ చట్టం రూపొందించబడింది. ఈ చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో భూసేకరణ లేదా సహజ వనరుల వినియోగం చేపట్టే ముందు స్థానిక గ్రామసభల ఆమోదం తప్పనిసరి. గార్ల మండలంలో ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే జీవో నెంబర్ 98 ద్వారా నిధులు మంజూరు చేయడం గిరిజనుల స్వయంపాలన హక్కులను కాలరాయడమే. రాజ్యాంగ బద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం చట్టరీత్యా చెల్లదు. ఇదొక నిరంకుశ నిర్ణయం**త్యాగం రైతుది... లాభం ఎవరికి?** లింక్ కెనాల్ నిర్మాణం కోసం సుమారు 9.5 కిలోమీటర్ల మేర సాగే కాలువ తవ్వకానికి 350 ఎకరాల సారవంతమైన భూమి అవసరం. గిరిజన రైతులు నిరాశ్రయులవుతారుఇక్కడ భూమి కోల్పోయేది సామాన్య, చిన్న, సన్నకారు గిరిజన రైతులు. భూములను త్యాగం చేస్తున్న ఈ ప్రాంత రైతాంగానికి ఈ కాలువ ద్వారా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందదు. తమ కళ్ల ముందే తమ నీరు పక్క ప్రాంతాలకు తరలిపోతుంటే, తమ భూములు ఎడారిగా మారడం ఏ రకమైన న్యాయం?**నిర్లక్ష్యపు నీడలో మున్నేరు ప్రాజెక్టు:** మున్నేరు ప్రాజెక్టు చరిత్ర అంతా పాలకులు మరిచిన వాగ్దానాల మయమే. 2009లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో 1076 జీవోతో 131 కోట్ల రూపాయలు ఇచ్చినా, ఆ నిధులు ఖర్చు




చేయలేదు. గత అరవై ఐదేళ్లలో జీవోలు సర్వేల పేరుతో కాలయాపన చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా పాత ప్రాజెక్టును పూర్తి చేయడంపై కాకుండా, ఉన్న నీటిని తరలించడంపైనే ఉత్సాహం చూపడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి.**నీటి పంపిణీలో అసమానతలు:** పాలేరు చెరువుకు ఇప్పటికే నాగార్జున సాగర్, భక్త రామదాసు మరియు సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి వనరులు ఉన్నాయి. కానీ, కేవలం వర్షాధారంపైనే ఆధారపడి బతుకుతున్న గార్ల ప్రాంత రైతుల నోరు కొట్టి, 10 టీఎంసీల నీటిని పాలేరుకు తరలించడం "సహజ న్యాయ సూత్రాలకు" విరుద్ధం. ఎగువన ఉన్న వారి అవసరాలు తీర్చకుండా దిగువకు నీటిని మళ్లించడం ప్రపంచ వ్యాప్త జల సూత్రాల ఉల్లంఘనే. పాలకులకు కావాల్సింది చిత్తశుద్ధి. అభివృద్ధి అంటే ఒక ప్రాంతాన్ని నాశనం చేసి మరొక ప్రాంతాన్ని నిర్మించడం కాదు. ప్రభుత్వం తక్షణమే జీవో నెంబర్ 98ని రద్దు చేయాలి. ప్రాధాన్యత క్రమంలో మొదట పెండింగ్‌లో ఉన్న మున్నేరు ప్రాజెక్టును పూర్తి చేసి 60 వేల ఎకరాలకు సాగునీరు అందించాలి. గిరిజన రైతుల భూములను కాపాడాలి. మున్నేరు జలాలు ఈ ప్రాంత ప్రజల జీవనరేఖ. వాటిని కాపాడుకోవడం వారి ప్రాథమిక హక్కు. ఈ హక్కుల హరణం కొనసాగితే అది కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, ఒక బలమైన సామాజిక ఉద్యమానికి దారితీస్తుంది.



**- ది.29.01.2026విశ్వ జంపాల, న్యాయవాది రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ విద్యావంతుల వేదిక**

# సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.




**కర్నూలు జనవరి 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి హెచ్చరించారు. జిల్లాలో భూ సర్వే విభాగం పనితీరులో మరింత పారదర్శకత, బాధ్యత మరియు ప్రజల నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సర్వే డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఎఫ్ పి ఓ ఎల్ ఆర్, రీ సర్వే, ఐవిఆర్ఎస్ కాల్స్, సర్వే కు సంబంధించిన అంశాలపై విలేజ్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్వేయర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటో, రెండో దరఖాస్తులు వస్తే అవి కూడా చేయలేరా అని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వకుండా ఫీల్డ్ కు ఎలా వెళతారు అని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సర్వే చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేయర్ల మీద చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇష్టం వచ్చినట్లు పనిచేస్తే కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ సర్వేలో డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో మంచి పేరు వచ్చేలా పని చేయాలని సూచించారు. విలేజ్ సర్వేయర్లు అటెండెన్స్ వేయడం లేదని, ప్రతిరోజూ విధులకు హాజరైనట్లు వంద శాతం హాజరు నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. హాజరు నమోదు చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్లు తహసీల్దార్ కు రిపోర్ట్ చేయాలని, రెవెన్యూ శాఖతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే విభాగం పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని, సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా టాప్5 ర్యాంకులో నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పబ్లిక్ పాజిటివ్ పర్ఫార్మెన్స్ సూచికల్లో జిల్లా మంచి స్థానాల్లో నిలవాలంటే ప్రతి ఉద్యోగి నిజాయితీగా, నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సర్వే కు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా సర్వే అధికారి ముని కన్నన్, ఆర్డీవో సందీప్ కుమార్, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# "మున్నేరు జల దోపిడి ఆపాలి"


అత్యంత కీలకమైన మున్నేరు పరీవాహక ప్రాంత రైతాంగ ప్రయోజనాలను ప్రక్కన బెట్టి, 5వ షెడ్యూల్ ప్రాంతాల హక్కులు, పెసా (గ్రాజుగూ) చట్టం ఉల్లంఘిస్తూ 10 టీఎంసీల మున్నేరు జలాలను "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్" ద్వారా రెండు పంటలు పుష్కలంగా పండుతూ నాగార్జున సాగర్ ఆయకట్టుగా వున్న పాలేరు చెరువుకు తరలించడం అన్యాయం, అక్రమం. మున్నేరు నీరు ఆ ప్రాంత ప్రజల జీవనాధారం. చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రాజెక్టులు చేపడితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం నుండి ప్రవహిస్తున్న మున్నేరుపై దుబ్బగూడెం - మద్దివంచ గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ నుండి మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ (గ్రావిటీ కాలువ) ప్రారంభించబడి గార్ల మండలంలోని బుద్ధారం సమీపంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాల్వకు అనుసంధానం చేయడం ద్వారా పాలేరు చెరువుకు 10 టీఎంసీల నీటిని తరలించనున్నారు. మే 17, 2025న మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి 162.54 కోట్ల రూపాయల నిధులు మంజూరి చేస్తూ జీవో నెంబర్ 98ని ఖమ్మం జిల్లా మంత్రుల ప్రమేయంతో కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసింది. మున్నేరు-పాలేరు లింకు కెనాల్ నిర్మాణం కోసం గార్ల మండలంలో 9.5 కిలోమీటర్ల పొడవున భారీ కాలువ తవనున్నారు. ఈ కాలువ క్రింద చిన్న సన్న కారు పెద గిరిజ రైతులు 350 ఎకరాల వ్యవసాయ సాగు భూములను కోల్పోనున్నారు. ఒక చుక్క నీరు కూడా మున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి ఇవ్వడం లేదు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం నియోజిక వర్గాలలో 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగునీరు అందించాల్సిన మున్నేరు పప్రాజెక్ట్ ను 60 సంవత్సరాలుగా ప్రభుత్వాలు చారిత్రక నిర్లక్ష్యం చేస్తున్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 131.67 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ తేది 24.06.2009న జీవో నెంబర్ 1076 ను విడుదల చేసింది, కానీ మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాన్ని సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టులో కలుపుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వార్ధ పూరిత రాజకీయ ప్రయోజనాలకు సీత రామ ప్రాజెక్ట్ బాలిపశువుగా మారి మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతానికి సీతారామ జలాలు రాకుండా పోయాయి. సీత రామ ప్రాజెక్ట్ విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో చేసిన తప్పిదాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దాల్సి వుండగా అదే తప్పిదాన్నియాదాతథంగా కొనసాగించడం ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యానికి, తెలితక్కువ తనానిన్ని తేటతెల్లం చేస్తుంది. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలంలో నిర్మించనున్న "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్" నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పాలేరులో వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మున్నేరు ప్రాజెక్టు, "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", తదితర నీటి ప్రాజెక్ట్ ల విషయంలో ఆయా ప్రాంతాల నీటి అవసరాలను,చారిత్రక , భౌతిక, వాస్తవిక అంశాలను వెల్లడించకుండా ఖమ్మం జిల్లా మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తప్పుదారి పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ ప్రాజెక్ట్ ల పట్ల ఖమ్మం జిల్లా మంత్రుల వైఖరిని తీవ్రంగా పరిగణిస్తున్నారు. **లింకు కెనాల్ ప్రధాన అభ్యంతరాలు** ఐదవ షెడ్యూల్ పరిధిలోకి వచ్చే గార్ల మండల ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామసభల (గ్రాజుగూ) అనుమతి లేకుండా "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", నిర్మాణం చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ మరియు చట్టపరమైన ఉల్లంఘన క్రిందకు వస్తుంది. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రాజుగూ చట్టం ప్రకారం గ్రామసభల ముందస్తు అనుమతి తప్పనిసరి. దీనిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందిమున్నేరు పరివాహక ప్రాంత రైతాంగానికి సాగు, తాగునీరు అందించకుండా, 10 టీఎంసీల నీటిని తరలించడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం. స్థానిక హక్కుల నిరాకరణగా పరిగణించబడుతుంది. 9.5 కి.మీ "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్" నిర్మాణం వల్ల సుమారు 350 ఎకరాల సారవంతమైన గిరిజన రైతుల భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. లి పర్యావరణ మరియు సామాజిక ప్రభావం: 350 ఎకరాల సారవంతమైన గిరిజన భూములు కోల్పోవడంపై సరైన సామాజిక, పర్యావరణ ప్రభావ అంచనా (Social and Environmental Impact Assessment) జరగలేదు. భూమి కోల్పోవడమే గాక సాగు త్రాగు నీటి అవసరాలు తీర్చకపోవడం తీవ్ర అభ్యంతరకరం. 2009లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన GO.NO.1076 ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం, మున్నేరు ప్రాజెక్టు కేవలం రాజకీయ వాగ్దానంగానే మిగిలిపోవడం, ఈ ప్రాంత ప్రజల పట్ల పాలకుల వివక్షకు అద్దం పడుతోంది. ఇది ప్రభుత్వాల చారిత్రక నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది. ఇప్పటికే నాగార్జున సాగర్, భక్త రామదాసు మరియు సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీరు అందుతున్న పాలేరు చెరువుకు అదనంగా మున్నేరు నీటిని తరలించడం ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుంది. ఈ విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసమాన నీటి పంపిణీకి అవకాశం కల్పిస్తుంది. **నీటి హక్కులు:** అప్పర్ స్ట్రీమ్ (ఎగువ ప్రాంతం) ప్రజల అవసరాలు తీర్చకుండా లోయర్ స్ట్రీమ్ (దిగువ ప్రాంతం) కు నీటిని తరలించడం అంతర్-ప్రాంతీయ జల సూత్రాలకు విరుద్ధం. **మున్నేరు ప్రాజెక్టు నిర్మాణమే ఆ ప్రాంత సుస్థిర అభివృద్ధికి ఏకైక మార్గం** ఇన్ని వ్యతిరేకతలు, అభ్యంతరాలు ఉన్నప్పటికి "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", నిర్మాణం చేపట్టడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 18న "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", శంకుస్థాపన చేయడానికి సిద్ధమవుతుండటం స్థానికులలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. మున్నేరు నదిపై మున్నేరు ప్రాజెక్ట్ (మున్నేరు రిజర్వాయర్) కడితే గార్ల, బయ్యారం మండలాల్లోని వేల ఎకరాలకు నీరు అందుతుంది, కానీ ఆ పనులు పక్కన పెట్టి కేవలం తరలింపు కెనాల్‌పై దృష్టి పెట్టడం వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను ఎండగాడుతూ స్తానిక ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజాబిష్టం మేరకు "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", ను విరమించుకుంటూ "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్", నిర్మాణం కొరకు ఇచ్చిన జీవో ను రద్దు చేసి ప్రభుత్వం తన విజ్ఞతను చాటాలి. మున్నేరు నీటిపై ఆ ప్రాంత ప్రజలకు ఉన్న సహజ సిద్ధమైన హక్కులను కాపాడుకోవడానికి న్యాయ పోరాటంతో పాటు ప్రజా పోరాటం చాలా అవసరం. మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ కంటే మున్నేరు ప్రాజెక్టు నిర్మాణమే ఆ ప్రాంత సుస్థిర అభివృద్ధికి ఏకైక మార్గం.



**- విశ్వ జంపాల, న్యాయవాది రాష్ట్ర ఉపాద్యక్షులు తెలంగాణ విద్యావంతుల వేదిక మొబైల్.7793968907**

# "మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ రాజ్యాంగ విరుద్ధం"

మున్నేరు పరివాహక ప్రాంతానికి సాగు, త్రాగు నీరు ఇవ్వకుండా 10 టీఎంసీల మున్నేరు నీటిని "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్" వయా సీతారామ కాలువ ద్వారా పాలేరు చెరువుకు తరలించడం రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మే 17, 2025న మున్నేరు - పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి 162.54 కోట్ల రూపాయల నిధులు మంజూరి చేస్తూ జీవో నెంబర్ 98ని విడుదల చేసింది. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాంతీయ అంతర్గత జల దోపిడికి నిదర్శనం. జల వనరుల సహాజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలం నుండి మున్నేరు ప్రవహిస్తూ ఆంధ్రాలో ప్రకాశం బ్యారేజ్ ఎగువ భాగంలో కృష్ణా నదిలో కలుస్తుంది. గార్ల మండలంలోని దుబ్బగూడెం - మద్దివంచ గ్రామాల మధ్య మున్నేరుపై ఉన్న చెక్ డ్యామ్ వద్ద ఈ లింక్ కెనాల్ నిర్మాణం ప్రారంభించబడి గార్ల మండలంలోని బుద్ధారం సమీపంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాల్వకు అనుసంధానం చేయనున్నారు. ఈ నీళ్లు పాలేరు నుంచి చీరా కాలువ ద్వారా ఖమ్మం, వైరా, సత్తుపల్లి ప్రాంతాలకు రెండవ, మూడవ పంటకు నీళ్ల స్థిరీకరణకు ఉపయోగిస్తారు. మున్నేరు-పాలేరు లింకు కెనాల్ నిర్మాణంలో భాగంగా గార్ల మండలంలో 9.5 కిలోమీటర్ల పొడవున భారీ కాలువ తవనున్నారు. ఈ కాలువ నిర్మాణం క్రింద 350 ఎకరాల సారవంతమైన వ్యవసాయ సాగు భూములను చిన్న, సన్నకారు, పేద, గిరిజన రైతులు కోల్పోనున్నారు. కానీ ఒక చుక్క నీరు కూడా మున్నేరు పరివాహక ప్రాంతానికి గాని గార్ల మండలానికి గాని ఇవ్వడం లేదు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూరు వద్ద మున్నేరుపై "మున్నేరు ప్రాజెక్టు" నిర్మాణం చేసి మున్నేరు పరిహార ప్రాంతానికి త్రాగు సాగునీరు ఇవ్వాలని గత 60 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు, ప్రజా పోరాటాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో తెలంగాణ ఉద్యమం మున్నేరు ప్రాజెక్ట్ ప్రధాన ఏజెండాగా కొనసాగింది. అధికార ప్రతిపక్ష పార్టీల ఎన్నికల ఎజెండాగా, రాజకీయ వాగ్దానంగా మున్నేరు ప్రాజెక్టు మిగిలిపోయింది. నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ పాలకుల నుండి నేటి తెలంగాణ పాలకుల వరకు మున్నేరు పరివాహక ప్రాంత ప్రజల పట్ల మోసాల పరంపర కొనసాగుతూనే ఉంది. నలుగురు ముఖ్య మంత్రులు మున్నేరు ప్రాజెక్ట్ ను కదిలించి వదిలేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 131.67 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ తేది 24.06.2009న జీవో నెంబర్ 1076 ను విడుదల చేశారు. రాజశేఖర్ రెడ్డి చనిపోవడంతో ఆ జీవో మరుగున పడిపోయింది. టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ప్రతిపక్ష నేతగా మున్నేరు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ తేది.18.08.2010న అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశపడ్డారు, కానీ మున్నేరు ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాన్ని సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టులో కలుపుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (రోళ్ళపాడు రిజర్వాయర్) కు 7,800 కోట్ల రూపాయలు మంజూరీ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం, రోళ్ళపాడు వద్ద ది.16.02.2016న శంకుస్తాపన




చేశారు. దీనితో మున్నేరు ప్రాజెక్టును పక్కన పెట్టారు. 2018 సంవత్సరంలో నాడు, నేడు మంత్రిగా కొనసాగుతున్న తుమ్మల నాగేశ్వర రావు ప్రమేయంతో సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ గావించి రోళ్లపాడు రిజర్వాయర్, బయ్యారం రిజర్వాయర్, మున్నేరు ఆయకట్టు ప్రాంతాలను సీతారామ ప్రాజెక్టు నుండి మినహాయించారు. మరొక ప్రక్క సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. సీతారామ ప్రాజెక్టు నీళ్లు రాక, మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి నోచుకోక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటే, మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లు 10 టిఎంసిల మున్నేరు నీటిని పాలేరు చెరువుకు తరలించేందుకు "మున్నేరు-పాలేరు లింకు కెనాల్" ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రభుత్వం తెరమీదకు తీసుకురావడం ఈ ప్రాంత ప్రజల నోట్లో మట్టి కొట్టడమే గాక మరొకటి కాదు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ కావాలని ఏ ఒక్కరూ అడగకపోయినా పాలకుల వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే మున్నేరు - పాలేరు లింకు కెనాల్ ను మంజూరు చేశారు. ఈ లింక్ కెనాల్ నిర్మించే మున్నేరు పరివాహక ప్రాంతం పూర్తిగా రాజ్యాంగంలోని 5వ, షెడ్యూల్లో చేర్చబడిన ఏజెన్సీ ప్రాంతం. ఏజెన్సీ గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కి, ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కాంగ్రెస్ పాలకులు మున్నేరు నీళ్లను పాలేరుకు తరలించేందుకు ఆగమేఘాల మీద జీవో జారీ చేసి సర్వేలు చేస్తున్నారు. ఈ కాలువ నిర్మాణ ప్రాంతంలో " పేసా గ్రామ సభలు" నిర్వహించలేదు, గ్రామ సభల ఆమోదం పొందలేదు, అయినప్పటికీ జనవరి 18, 2026న పాలేరు నుండి ఈ కాలువ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటన వెలువడింది. నిజానికి పాలేరు చెరువు ఆయకట్టు ప్రాంతానికి రెండు పంటలకు సరిపడా నాగార్జునసాగర్ నీళ్లు వస్తుండగా సీతారామ ప్రాజెక్టు నీళ్లు, భక్త రామదాసు ప్రాజెక్ట్ నీళ్లను పాలేరు చెరువుకు కేటాయించారు. ఇవి చాలవన్నట్లు 10 టీఎంసీల మున్నేరు జలాలను "మున్నేరు పాలేరు లింక్ కెనాల్" ద్వారా తరలించేందుకు ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ ఏజెన్సీ, గిరిజన నియోజిక వర్గాల ప్రజాప్రతినిధులు, జిల్లా స్తాయి రాజకీయ నేతలు మున్నేరు, సీతారామ ప్రాజెక్ట్ ల జల దోపిడిని ప్రశ్నించక పోవడం దురదృష్టకరం. ఈ నియోజిక వర్గాల ప్రజాప్రతినిధులు, నేతలు బలహీనంగా వుండడమే గాక ఖమ్మం జిల్లా మంత్రుల మీద ఆధారపడడం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోవడం ఆయా మంత్రుల అధికార నీయంతృత్వానికి నిదర్శనం. ఈ లింకు కెనాల్ నిర్మాణం చేస్తున్న గార్ల మండలం పూర్తిగా ఏజెన్సీ గిరిజన ప్రాంతం. కేవలం వర్షాధార వ్యవసాయం మీదనే ఆధారపడిన చిన్న సన్న కారు రైతులు ఉన్నారు. ఈ లింక్ కెనాల్ నిర్మాణం పట్ల గార్ల మండల ప్రజలు, రైతాంగం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అఖిలపక్షంగా ఏర్పడి మున్నేరు పాలేరు లింకు కెనాల్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజ ఆందోళన కార్యక్రమాలకు సైతం సిద్ధమవుతున్నారు. ఇటీవల గార్ల మండలం దుబ్బగూడెంలో అధికారులు ఈ కాలువ నిర్మాణం కోసం సర్వే చేస్తుండగా రైతులు, ప్రజలు అధికారులను అడ్డుకున్నారు. చేసేదేమీ లేక అధికారులు చేతులెత్తేసి పొంతనలేని సమాధానాలు చెబుతూ వెనుతిరిగి పోయారు. ఈ మేరకు గార్ల మండల అఖిల పక్ష నేతలు మున్నేరు- పాలేరు లింకు కెనాల్ జీవో నెంబర్ 98 ని రద్దు చేయాలని, మున్నేరు ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు సాగు తాగునీరు అందించాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రజా ప్రతినిధులకు, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కాలువ నిర్మాణం జరుగుతే మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు మున్నేరు నీటిపై శాశ్వత హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో మున్నేరు పరివాహక ప్రాంతం వర్షాలు పడకపోతే పంటలు పండక కరువు కోరల్లో చిక్కి ఎడారిగా మారే పరిస్థితులు దాపురిస్తాయని ఈ ప్రాంత విద్యావంతులు మేధావులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 60 ఏళ్లుగా హామీలకు, జీవోలకు, సర్వేలకు పరిమితమవుతున్న మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణా కి నిధులు మంజూరు చేసి, మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు సాగు తాగునీరు అందించాలి. తక్షణమే చట్ట విరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మున్నేరు -పాలేరు లింక్ కెనాల్ జి.వో 98 ను రద్దు చేయాలి, లేదంటే గార్ల మండలం మరో లగచర్లగా మారుతుంది. చిరకాల స్వప్నమైన మున్నేరు ప్రాజెక్టు నిర్మించి సారవంతమైన ఏజెన్సీ బీడు భూములను సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉన్నది. లేదంటే భవిష్యత్తులో మున్నేరు పరివాహక ఏజెన్సీ ప్రాంతం మరో కరువు సీమగా మారుతుంది. ప్రాంతీయ అసమానతలు ఏర్పడి మున్నేరు జల దోపిడీకి వ్యతిరేకంగా జల యుద్ధాలకు దారితీస్తుంది. పాలకులు ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధిని కాంక్షించాలి. అంతర్గత ప్రాంతీయ అసమానతలు ఏర్పడకుండా నేటి పాలకులు సరైన నిర్ణయాలు తీసుకోవాలి లేదంటే భవిష్యత్ తరాలు ఈ పాలకులను ఎప్పటికీ క్షమించవు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అటు గోదారిలో ఇటు మున్నేరులో ముంచడం ఖాయం.

**- ది.17.01.2026 విశ్వ జంపాల, న్యాయవాది రాష్ట్ర ఉపాద్యక్షులు తెలంగాణ విద్యావంతుల వేదిక మొబైల్.7793968907**

